


ర్యాపిడ్ కిట్లతో పరీక్షలు
నిపుణులు లేకున్నా.. రిపోర్టులు
ప్రైవేటు ల్యాబ్‌కెళ్తే జేబు ఖాళీ

డెంగీ వైద్యం మాటున దందా

జ్వరం నిర్ధారణకే వేలల్లో వసూలు



చిలమత్తూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన చిన్నారికి జ్వరం రావడంతో వారం రోజుల క్రితం హిందూపురం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యుడు పరీక్షించి, వెంటనే డెంగీ, వైరల్ ఫీవర్ పరీక్షల కోసం ల్యాబ్‌కు రాశారు. చిన్నారిని ల్యాబ్‌కు తీసుకెళ్లి పరీక్షలు చేయగా సాధారణ జ్వరమని తేలింది. రూ.వెయ్యి బిల్లు చెల్లించారు. ఇంటికెళ్లాక రెండురోజులైనా జ్వరం తగ్గలేదు. దీంతో మరోసారి అదే వైద్యుడి వద్దకు రాగా.. మళ్లీ వైద్య పరీక్షల్లో డెంగీ అని తెలిపారు. దీంతో మరో వెయ్యి రూపాయలు బిల్లు చెల్లించుకోవాల్సి వచ్చింది.

హిందూపురం పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లి ప్రాంతానికి చెందిన ఓ యువకుడికి జ్వరం సోకడంతో ఆర్పీజీటీ రోడ్డులోని ఓ ప్రైవేటు వైద్యుడి వద్దకెళ్లాడు. జ్వరం ఉందని రక్త పరీక్షలు రాశాడు. ఆ వైద్యుడు ఒకేసారి మలేరియా, టైఫాయిడ్, డెంగీ పరీక్షలు రాయడంతో ల్యాబ్‌కు వెళ్లి రూ.2వేలు చెల్లించి, నిర్ధారించుకున్నాడు. వీరిద్దరిదే కాదు.. జ్వరంతో ప్రైవేటు ఆస్పత్రికి వస్తున్న ప్రతి ఒక్కరి ఆవేదన, బాధ ఇదే.

ఇటీవల హిందూపురం ప్రాంతంలో జ్వరాలు విపరీతంగా వ్యాప్తిచెందాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఇదే అదునుగా భావించిన కొన్ని ప్రైవేటు ల్యాబ్‌లు డెంగీ పేరుతో నయా దందాకు తెర లేపుతున్నాయి. అమ్మో జ్వరాలు అనేలా చేసే ఈ సీజనల్ వచ్చిన జ్వరాలతో భారీ దందాకు పూనుకున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. సాధారణంగా వచ్చే విషజ్వరాలను సైతం డెంగీగా చూపుతూ ప్లేట్‌లెట్స్ పేరుతో అక్రమాలకు పాల్పడుతున్నారని కొంతమంది వైద్యులే పేర్కొంటుండడం గమనార్హం. పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో కొన్నిచోట్ల అవసరమున్నా.. లేకున్నా.. ల్యాబ్‌కు పంపి పేదల జేబులను గుల్ల చేస్తున్నారు. - హిందూపురం

అవసరమున్నా.. లేకున్నా..

వర్షాకాలం కావడంతో పరిసర ప్రాంతాల్లో పారిశుధ్యలోపంతోపాటు కొంతమంది వ్యక్తిగత పరిశుభ్రతను పాటించకపోవడంతో దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయి. వాటి కాటువల్లే ఈ సీజన్‌లో ఎక్కువమంది విషజ్వరాల బారిన పడుతున్నారు. మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్, డెంగీ.. ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. వారంరోజుల వ్యవధిలోనే ప్రభుత్వ ఆస్పత్రిలో 20 మందికిపైగా పిల్లలు డెంగీ బారినపడి వైద్యం పొందినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇక ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎంతమంది చికిత్స పొందారో తెలియని పరిస్థితి. గతంలో ప్రైవేటు ఆస్పత్రుల్లో ల్యాబ్‌లు నిర్వహించేవారు కాదు. ప్రస్తుతం కొంతమంది ల్యాబ్‌లు ప్రారంభించారు. దీనివల్ల ప్రైవేటు వైద్యులు ఇష్టారాజ్యంగా పరీక్షలు రాస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ప్రైవేటు ల్యాబ్‌కు తక్కువ పరీక్షలు రాసేవారు. ప్రస్తుతం అవసరమున్నా.. లేకున్నా.. ఎక్కువ పరీక్షలకు రాసి పంపుతున్నారు. ఇటీవల ఉన్నతాధికారులు దీనిపై సీరియస్ అయినా కొంతమంది ప్రైవేటు వైద్యులు, ల్యాబ్ నిర్వాహకులు నిబంధనలు గాలికి వదిలేశారు.

ప్లేట్‌లెట్స్ పేరుతో..

సాధారణంగా ఏ రోగికైనా డెంగీ నిర్ధారణ అయితే ప్లేట్‌లెట్స్ పడిపోవడం సహజం. ఎవరికైనా ఎక్కువ జ్వరం వస్తే 50వేలలోపు పడిపోతాయి. దీనిని ఆసరాగా తీసుకున్న ప్రైవేటు వైద్యులు కొంతమంది ప్లేట్‌లెట్స్ పేరుతో విచ్చలవిడిగా పరీక్షలతోపాటు మందులు ఇచ్చి రోగుల జేబులు గుల్ల చేస్తున్నారు. డెంగీ లక్షణాలున్న రోగి రక్త నమూనాలు ప్రభుత్వ ఆస్పత్రి ల్యాబ్‌కు పంపి, నిర్ధారణ అయిన తరువాత ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం అందించవచ్చు. ఇవేవీ పాటించకుండా డెంగీ లక్షణాలున్నాయంటూ పరీక్షలు చేయడం, చికిత్సలు అందించడం పురంలో సర్వసాధారణంగా మారింది.

ర్యాపిడ్ కిట్లతో పరీక్షలు



ర్యాపిడ్ కిట్లతోనే ప్రైవేటు ల్యాబ్‌లలో డెంగీ పరీక్షలు విచ్చలవిడిగా చేస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లలో పెథాలజిస్ట్ ఉండాలి. హిందూపురంలో ఒకరిద్దరు మాత్రమే ఉన్నారు. అయినా అర్హతలేని వారితో పదుల సంఖ్యలో ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారు. కొంతమంది ల్యాబ్ నిర్వాహకులు అనంతపురం, బెంగళూరుకు ఆన్‌లైన్‌లో పంపి రిపోర్టు తెప్పించుకుంటున్నారు. నిబంధనల ప్రకారం డెంగీ పరీక్షలు ఎలీషా విధానంలో చేసి, నిర్ధారించాల్సి ఉంది. ప్రైవేటు ఆస్పత్రులు మాత్రం ఆ నిబంధనలను తుంగలో తొక్కి పరీక్షలు చేస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డెంగీని నిర్ధారించాలంటే రోగి రక్త నమూనాలను ఎలిషా విధానంలో పరీక్షించాలి. ఇది ఆలస్యం అవుతుందని ర్యాపిడ్ కిట్లతో 10నిమిషాల్లోపే నిర్ధారించి, రిపోర్టు ఇచ్చేస్తున్నారు.

సగం వైద్యులకే..?



ప్రైవేటు ల్యాబ్‌లకు పరీక్షల కోసం పంపే వైద్యులకు బిల్లులో సగం ఇవ్వాలంటూ ల్యాబ్ నిర్వాహకులు వాపోతున్నారు. వైద్యులు పరీక్షల కోసం పంపిస్తే అయ్యే బిల్లులో 50 శాతం సంబంధిత వెద్యుడికి ఇవ్వాల్సి ఉంటుందని ఓ ల్యాబ్ నిర్వాహకుడు పేర్కొన్నారు. అంతకన్నా తక్కువగా ఇస్తే ఆ ల్యాబ్‌కు పరీక్షల కోసం వైద్యుడు సిఫార్సు చేయడు. దీంతో చేసేదిలేక వైద్యుడు అడిగినంత ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చిందని ల్యాబ్ నిర్వాహకులు వాపోతున్నారు. ఈ కారణంగా కొన్ని సందర్భాల్లో ప్రభుత్వం నిర్దేశించిన రుసుం కన్నా అధికంగా పరీక్షల కోసం వసూలు చేయాల్సి ఉటుందని చెబుతున్నారు.

అధికంగా వసూలు చేస్తే చర్యలు

ప్రైవేటు ల్యాబ్‌లలో ప్రభుత్వం నిర్ణయించిన రుసుమే వసూలు చేయాలి. అంతకుమించి వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. ప్రైవేటు ల్యాబ్‌లో డెంగీ నిర్ధారణ అయినట్లు చెప్పడానికి వీలులేదు. డెంగీ లక్షణాలున్నట్లు అనుమానం వస్తే ప్రభుత్వ ఆస్పత్రికి పంపి ఎలిషా పరీక్ష ద్వారా నిర్ధారించుకోవాలి. అంతే తప్ప. ప్రైవేటు ల్యాబ్‌లలో డెంగీ నిర్ధారించడం నిబంధనలకు విరుద్ధం. జిల్లాలో డెంగీ నిర్ధారణ కేంద్రాలు హిందూపురం, కదిరి ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాత్రమే ఉన్నాయి. డెంగీ పరీక్షలు అక్కడే చేయించుకోవాలి.

- మంజువాణి, జిల్లా వైద్యాధికారి

కింకర రోడ్లు..!

గత వైసీపీ పాలనలో అభివృద్ధి అటకెక్కిందన్నది నిర్వివాదాంశం. రోడ్లలో గుంతలు, పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. కొత్త రోడ్ల నిర్మాణం సంగతి దేవుడెరుగు, దెబ్బతిన్న వాటికి మరమ్మతులు కూడా చేపట్టలేదు. దీంతో ఐదేళ్లూ జనం నడిరోడ్లపై నరకం చూశారు. తీరా ఎన్నికలకు కొన్ని నెలల ముందు కొత్త రోడ్లు వేస్తామంటూ అక్కడక్కడా హడావుడి చేశారు. ఎన్నికల్లోగా పూర్తి చేస్తామంటూ మొదలెట్టారు. కొన్ని చోట్ల మట్టివేసి, మరికొన్ని చోట్ల కంకర పరిచి వదిలేశారు. ఆ రోడ్లలో పాదచారులు, వాహనదారులు ప్రస్తుతం తిప్పలు పడుతున్నారు. తనకల్లు మండలంలోని నడిమికుంటపల్లి, సుబ్బరాయునిపల్లి, రత్నగిరి, సిగిరివాండ్లపల్లి, మార్పురవాండ్లపల్లి, రాగినేపల్లి, కురమాలపల్లి, పెద్ద ఎద్దులవారిపల్లి గ్రామాలకు రోడ్ల పనులను ఏడాది క్రితం అప్పటి వైసీపీ పాలకులు హడావుడిగా ప్రారంభించారు. మట్టిరోడ్లు వేసి, కంకర తోలారు. ఎన్నికల్లోగా పూర్తి చేస్తామని వాగ్దానాలు గుప్పించారు. అవి అమలుకు నోచుకోలేదు. కంకర పరిచి, వదిలేశారు. తారు వేయలేదు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ఆపేశారు. దీంతో ఆ రోడ్లలో ప్రజలు, వాహనదారులు నిత్య నరకం అనుభవిస్తున్నారు. -తనకల్లు



కంకర పరిచి వదిలేసిన నడిమికుంటపల్లి రోడ్డు



మార్పురివాండ్లపల్లి రోడ్డు దుస్థితి

4 గంటల నరకం..!

108 కోసం నిరీక్షణ

ఆస్పత్రి బయటే రోగి

పలుమార్లు ఫోన్ చేసినా స్పందించని వైనం



ఆస్పత్రి బయట బండమీద పడుకున్న వృద్ధురాలు అంజినమ్మ

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 4: తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలికి నాలుగు గంటలపాటు నరకం చూపించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించేందుకు 108 వాహనం కోసం గంటలపాటు నిరీక్షించాల్సి వచ్చింది. పదే.. పదే.. 108 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసినా.. పట్టించుకునేవారు లేరని రోగి బంధువులు వాపోయారు. పెనుకండకు చెందిన అంజినమ్మ అనారోగ్యంతో సోమవారం సాయంత్రం హిందూపురం ఆస్పత్రికి వచ్చింది. పరీక్షలు చేసిన వైద్యులు కిడ్నీ సంబంధిత వ్యాధి ఉన్నట్లు నిర్ధారించారు. అనంతపురం ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఆమెను తరలించేందుకు బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి రోగి కుటుంబీకుడు 108 వాహనం కోసం దాదాపు ఏడుసార్లు ఫోన్ చేశాడు. సరైన స్పందన లేదని అతడు వాపోయాడు. సాయంత్రం 4 గంటలకు పక్క మండలం నుంచి 108 వాహనం వచ్చింది. అందులో అంజినమ్మను అనంతపురం తరలించారు. ఫోన్ చేయగానే రావాల్సిన 108 వాహనం గంటలు గడిచినా రాకపోవడం ఏంటని రోగి కుటుంబీకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

విచారించి.. చర్యలు తీసుకుంటాం

108 వాహనం ఆలస్యమైన విషయం నా దృష్టికి రాలేదు. దీనిపై విచారించి, చర్యలు తీసుకుంటాం.

- మంజువాణి, జిల్లా వైద్యాధికారి

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

ఏడు కిలోల గంజాయి స్వాధీనం

హిందూపురం, సెప్టెంబరు 4: మండలం తూముకుంట పారిశ్రామికవాడలో గంజాయిని విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌లో ఈ కేసు వివరాలను జిల్లా ఎస్పీ రత్న తెలియజేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సుమంత్ కుమార్ సింగ్, రజ్జన్, బిహార్‌కు చెందిన దీపక్ కుమార్, కృష్ణారాయ్, హిందూపురం పట్టణ పరిధి సడ్లపల్లికి చెందిన మురళీమోహన్‌రెడ్డి కొంతకాలంగా తూముకుంట, గోళ్లాపురం పారిశ్రామికవాడల్లో గంజాయి విక్రయిస్తున్నారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ మహేష్, సీఐ ఆంజనేయులు తమ సిబ్బందితో తూముకుంట పారిశ్రామికవాడలో దాడులు నిర్వహించారు. ముఠా సభ్యులు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఏడు కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఉపాధి కోసం పరిశ్రమలలో పనిచేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వీరు.. సునాయసంగా డబ్బు సంపాదించేందుకు గంజాయి వ్యాపారం చేస్తున్నారని ఎస్పీ తెలిపారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న



స్వాధీనం చేసుకున్న గంజాయి

కందిపంట కళకళ

మండలంలో సాగుచేసిన కందిపంట ఇటీవల కురిసిన వర్షాలకు కళకళలాడుతోంది. పంట ఏపుగా పెరిగింది. ఖరీఫ్‌లో వేరుశనగ కన్నా అధికంగా కందిపంటను రైతులు సాగుచేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు దిగుబడులు ఆశాజనకంగా వస్తాయని రైతులు పేర్కొంటున్నారు. మండలంలో సుమారు 5వేల హెక్టార్లలో సాగుచేసినట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పూత, పిందె ఏర్పడతాయన్నారు. సస్యరక్షణ చర్యలు చేపట్టి పూతను కాపాడుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. -ధర్మవరంరూరల్



ధర్మవరం మండల వసంతపురం వద్ద కళకళలాడుతున్న కంది పైరు

27 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

కొత్తచెరువు, సెప్టెంబరు 4: జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను డీఈఓ మీనాక్షి బుధవారం ప్రకటించారు. మొత్తం 27 మందిని అవార్డులకు ఎంపిక చేశారు. పుట్టపర్తి మండలం జగరాజుపల్లి సమీపంలోని మంగళకర ఎడ్యుకేషనల్ సొసైటీలో గురువారం గురుపూజోత్సవం నిర్వహించనున్నట్లు డీఈఓ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందజేస్తామన్నారు. గురుపూజోత్సవానికి జిల్లాలోని హెచ్ఎంలు, ఎంఈఓలు హాజరుకావాలని కోరారు.

తహసీల్దార్ అనుపమకు ఉద్యోగోన్నతి



అనుపమ

పుట్టపర్తిరూరల్: పుట్టపర్తి తహసీల్దార్ అనుపమకు డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఆమె గతనెల 4వ తేదీన పుట్టపర్తి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఉద్యోగోన్నతి పొందిన అనుపమకు పలువురు ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

జీపీఎస్ వాహనాల్లోనే ఇసుక తరలించాలి: కలెక్టర్

పుట్టపర్తి, సెప్టెంబరు 3: జీపీఎస్ కలిగిన, గనులశాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకున్న వాహనాలను మాత్రమే ఇసుక తరలించేందుకు అనుమతించాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్.. సంబంధిత అధికారులను ఆదేశించారు.



ఉచిత ఇసుక సరఫరాపై స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఇసుక బుకింగ్, రవాణాను మరింత సులభతరం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సాధారణ వినియోగదారులు సొంత వాహనంలో తీసుకెళ్లవచ్చన్నారు. దూరాన్ని బట్టి రవాణాచార్జీలను జిల్లా ఇసుక కమిటీ నిర్ణయించాల్సి ఉందన్నారు. రీచ్‌లు, స్టాక్ పాయింట్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని దిశానిర్దేశం చేశారు. రాత్రివేళ వాహనాలను అనుమతించవద్దన్నారు. సమావేశంలో జిల్లా మైనింగ్ అధికారి రామ్మోహన్, ఆర్డీఓలు భాగ్యరేఖ, వెంకటశివరామిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లికార్జునప్ప పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 4: ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యత్వానికి అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ, సాధికారత అధికారి శివరంగప్రసాద్ బుధవారం ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల కాలపరిమితితో ఏర్పాటుచేసే కమిటీలో ఐదుగురు సభ్యులుంటారన్నారు. ఎస్సీ, ఎస్టీల నుంచి ముగ్గురు, బీసీ, మైనారిటీ కులాలకు సంబంధించి సమాజసేవలో గుర్తింపు పొందిన (ఎన్జీఓలతో కలిసి పనిచేసిన) వారు అర్హులన్నారు. దరఖాస్తులను ఈనెల 13వ తేదీలోపు జిల్లాకేంద్రలోని సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. దరఖాస్తులు కూడా కార్యాలయంలో పొందవచ్చన్నారు.

విషజ్వరంతో బాలుడి మృతి

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 4: మండలంలోని చాకర్లపల్లిలో విషజ్వరంతో బాలుడు పవన్‌కుమార్ (10) మంగళవారం రాత్రి మరణించాడు. చాకర్లపల్లికి చెందిన మల్లికార్జున, స్వర్ణలత కుమారుడు పవన్‌కుమార్ నెలరోజుల నుంచి తీవ్ర జ్వరంతో బాధపడుతుండేవాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా తగ్గలేదు. రెండ్రోజుల క్రితం మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తరలించారు. డెంగీ లక్షణాలున్నట్లు అక్కడి వైద్యులు తెలిపారు. బాలుడికి జ్వరంతోపాటు ఫిట్స్ తోడవడంతో మృతిచెందినట్లు సమాచారం. దీనిపై స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి హరికుమార్‌ను అడగ్గా.. డెంగీ లక్షణాలున్నట్లు తమకు తెలియదన్నారు. బాలుడికి ఫిట్స్ ఉన్నట్లు తెలిసిందన్నారు. జ్వరానికి ఫిట్స్ తోడవడంతో మృత్యువాత పడినట్లు పేర్కొన్నారు.

స్త్రీనిధి రుణాలు పక్కదోవ పట్టిస్తే చర్యలు

డీఆర్‌డీఏ పీడీ నరసయ్య

కొత్తచెరువు, సెప్టెంబరు 4: జిల్లాలో మహిళా సంఘాలకు అందించే స్త్రీనిధి రుణాలను యానిమేటర్లు, సీసీలు, ఏపీఎంలు పక్కదోవ పట్టిస్తే చర్యలు తప్పవని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య హెచ్చరించారు. స్థానిక డ్వాక్రా కార్యాలయంలో బుధవారం పుట్టపర్తి, పెనుకొండ క్లస్టర్ల ఏపీఎంలు, సీసీల సమావేశం నిర్వహించారు. పీడీ నరసయ్య మాట్లాడుతూ.. పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం, పెనుకొండ మండలాల్లో స్త్రీనిధి రుణ బకాయిలను రికవరీ చేయాలన్నారు. 15వ తేదీలోగా రికవరీ చేస్తే అక్టోబరు మొదటి వారంలో మహిళా సంఘాలకు రుణాలు మంజూరవుతాయన్నారు. ఆ దిశగా పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీపీఎం రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తిదారుల సంఘాలకు సంపూర్ణ సహకారం: కలెక్టర్



ఉత్పత్తి చేసిన వస్తువులను పరిశీలిస్తున్న కలెక్టరు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 4: జిల్లాలో ఉత్పత్తిదారుల సంఘాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని జిల్లా కలెక్టరు వినోద్‌కుమార్ భరోసా ఇచ్చారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, వివిధశాఖల అధికారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ప్రదర్శనకు ఉంచిన పలు ఉత్పత్తి వస్తువులను చూసి ఆయన ఉత్పత్తిదారులను అభినందించారు. అనంతరం సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ ఉత్పత్తిదారుల సంఘాల సేవలు అభినందనీయమన్నారు. సంఘాల ద్వారా తయారు చేసిన వస్తువులను ప్రదర్శించి అమ్మకాలను ప్రోత్సహించేందుకు స్టాల్స్‌ను ఏర్పాటు చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ ఉమా మహేశ్వరమ్మ, జడ్పీసీఈఓ ఓబులమ్మ, నాబార్డు డీడీఎం అనూరాధతో పాటు పలువురు అధికారులు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

63 మంది గురువులకు 'ఉత్తమ' అవార్డులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 4: జిల్లాలో గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని 63 మందికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందిస్తున్నట్లు డీఈఓ వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కాలేజ్ డ్రామా హాల్‌లో ఉదయం 10 గంటలకు గురుపూజోత్సవం వేడుక ప్రారంభం అవుతుందన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన ఉపాధ్యాయులందరూ కార్యక్రమానికి హాజరై సన్మానం స్వీకరించాలన్నారు. అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు హాజరుకావాలని కోరారు.

10న అడ్మిషన్లకు కౌన్సెలింగ్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 4: అనంత వైద్యకళాశాలలో పారా మెడికల్ కోర్సుల్లో చేరడానికి ఈనెల 10న అడ్మిషన్ల కౌన్సెలింగ్ చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 69 సీట్లు ఉన్నాయని, అందులో డీఎంఎల్‌టీ10, డీఓఏ10, డీఏఎన్‌ఎస్30, డీఎంఐటీ10, డీఈసీజీ3, డీఆర్‌జీఏ3, డీడీఆర్ఏ3సీట్లు ఉన్నాయన్నారు. ఈసీట్లకు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 10న తమ ఒరిజనల్ సర్టిఫికెట్లు తీసుకొని అడ్మిషన్ల కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు.

రిజర్వాయర్‌కు 1,098 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 4: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1098 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో ఫేజ్-2కు 947 క్యూసెక్కులు, మరువ నుంచి 111క్యూసెక్కులు వెళుతోందని వారు వెల్లడించారు.

వరద బాధితులకు విరాళాలివ్వండి

పుట్టపర్తి, సెప్టెంబరు 4: వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకురావాలని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ విరాళాలు అందించాలన్నారు. దాతలు ఈ కింది బ్యాంక్‌లకు తమ విరాళాలు పంపాలన్నారు.

- ఎస్బీఐ సీఎంఆర్ఎఫ్ అకౌంట్ నెంబర్ 38588079208 ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్బీఐఎన్ 0018884,
- యూనియన్ బ్యాంకు సీఎంఆర్ఎఫ్ అకౌంట్ నెంబర్ 110310100029039 ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0830798,
- ఎస్బీఐ ఏపీడిజాస్టర్ మేనేజిమెంట్ అకౌంట్ నెంబర్ 00000036897128069 ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్బీఐఎన్ 0016857

పరీక్ష ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ సుదర్శన రావు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 4: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పరీక్షల ఫలితాలను ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు ఆన్‌లైన్ ద్వారా బుధవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ వర్సిటీ అనుబంధ కళాశాలల ఎంసీఏ, ఎంబీఏ విద్యార్థులకు జూలైలో పరీక్షలు నిర్వహించామన్నారు. ఎంసీఏ ద్వితీయ సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్, (ఆర్20, 17) సప్లిమెంటరీ పరీక్షలతోపాటు ఎంబీఏ ద్వితీయ సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్,(ఆర్17) సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదల చేశామని తెలిపారు. విద్యార్థులు వారి ఫలితాలకోసం www.jntuaresults.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు, సీఈ శివకుమార్, ఏసీఈలు శేఖర్‌రాజు, అంకారావు, శ్రీధర్ పాల్గొన్నారు.

ఎంటెక్ ఫలితాలు...

జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఎంటెక్ ద్వితీయ సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్ విద్యార్థులకు జూలై, ఆగస్టులో నిర్వహించిన పరీక్షల ఫలితాలను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి తన కార్యాలయంలో విడుదల చేశారు. ఫలితాల కోసం కళాశాల అకడమిక్ సెక్షన్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, డీసీఈలు లలితకుమారి, విష్ణువర్థన్, విభాగాధిపతులు భారతి, కళ్యాణిరాధ, మమత, భువన విజయ, రామశేఖర్ రెడ్డి, దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయండి

- న్యాయాధికారి శ్రీనివాస్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 4: బ్యాంకులు, ఇతర విభాగాల పరిధిలో వీలైనన్ని కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ సూచించారు. జిల్లా కోర్టులోని న్యాయాధికారి చాంబర్‌లో ఈనెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి లీడ్ బ్యాంకు మేనేజర్, బీమా కంపెనీలు, ఏపీఎస్ ఆర్టీసీ, చిట్‌ఫండ్ కంపెనీల వాళ్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ ఆర్థిక వివాదాలున్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు.

సద్వినియోగం చేసుకోండి

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలోని కోర్టులలో మోటార్ వాహనాల ప్రమాద భరిత కేసులు, సివిల్ కేసులు, చెక్‌బౌన్సు కేసులు, కుటుంబ తగాదాలు(విడాకుల కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ చేయదగిన క్రిమినల్ కేసులు, ప్రి లిటిగేషన్ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేస్తామని వెల్లడించారు.

టమాట మాట్లాడలేం..!

- భారీగా పతనమైన టమోటా ధరలు
- గిట్టుబాటు ధరలేక నష్టాల ఊబిలో రైతులు
- వర్షాలకు మరింతగా నష్టపోయిన దుస్థితి
- పంటను పశువులకు వదిలేస్తున్న వైనం

అనంతపురంరూరల్/ఆత్మకూరు,సెప్టెంబరు4: ధరలు పతనమవడంతో టమోటా రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి, ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో మరిన్ని అప్పులు పెరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు మార్కెట్‌లో వ్యాపారుల దోపిడీ రైతులను మరింత కుంగదీస్తోంది.

ఉమ్మడి జిల్లాలో 24వేల హెక్టారల్లో సాగు

ఉమ్మడి జిల్లాలో 24వేల హెక్టారల్లో టమోటా సాగు చేసినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. కంబదూరు, కళ్యాణదుర్గం, అనంతపురం రూరల్, ముదిగుబ్బ, కదిరి, ధర్మవరం, అనంతపురంరూరల్, పామిడి, శెట్టూరు, ఆత్మకూరు, గార్లదిన్నె, కూడేరు తదితర మండలాల్లో టమోటాను అధికంగా సాగు చేశారు. గత ఏడాది 18వేల నుంచి 20వేల హెక్టారల్లో పంట సాగైంది. ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. దిగుబడులు కూడా బాగానే ఉన్నాయి. రోజు కక్కలపల్లి టమోటా మార్కెట్‌కు 2500టన్నుల నుంచి 3500టన్నుల మధ్య వస్తున్నాయి. అయితే గిట్టుబాటు ధర లేకపోవడం రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. వాతావరణ మార్పులతో కాయలపై మచ్చలు వంటివి వస్తే ధర లేకుండా పోతోంది. దీనికితోడు తరచూ కురుస్తున్న వర్షాలకు పంట నీటిపాలవుతోంది. నీరుకాయలుగా పడి నో సేల్ కింద పడిపోవడం, లేదా తక్కువ ధర పలకడం జరుగుతోంది. ఈక్రమంలో పంటను మార్కెట్‌కు తీసుకువెళ్లలేక కొందరూ రైతులు తోటలోనే వదిలేస్తున్నారు. మరికొందరు మార్కెట్‌లో అమ్ముడు పోకపోతే అక్కడే వదిలేస్తున్నారు.

ఒక్కసారి తగిలితే చాలు..

నిత్యం నష్టాలు ఎదురవుతున్నా రైతులు టమోటా పంట సాగును వదలడం లేదు. ఒక్కసారి దిగుబడి, రేటు తగలితే తమ దశ మారిపోతుందన్న నమ్మకమే రైతన్నను టమోటా సాగువైపు నడిపిస్తోంది. మొక్క నాటడం మొదలుకొని పంట కోతకొచ్చేంతవరకు నిత్యం పెట్టుబడులు పెడుతూనే ఉన్నారు. ఈక్రమంలో ఎకరా సాధారణ సాగుకే రూ.40 నుంచి రూ.50వేలు పెట్టుబడులు అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఆ తరువాత ఒక సారి పంట కోతకు ఎకరానికి ఆరుగురు కూలీల లెక్కన ఒక్కొక్కరికి రూ.300లు చొప్పున రూ.2వేలు చెల్లిస్తున్నారు. ఆ తరువాత దిగుబడులను మార్కెట్‌కు తీసుకొచ్చేందుకు దూరాన్ని బట్టి సగటున ఒక్కో బాక్సుకు రూ.5 చెల్లిస్తున్నారు.

మార్కెట్‌లో దోపిడీ

వ్యయప్రయాసలకోర్చి పంట పడించి మార్కెట్‌కు తేవడం ఒకెత్తైతే, మార్కెట్‌లో సరుకు అమ్ముడుపోయేంత వరకు రైతులు పడే ఆందోళన మరో ఎత్తు. వ్యాపారుల దోపిడీతో రైతులకు నష్టాలు తప్పడం లేదు. ఇక్కడ పది శాతం కమీషన్ రూపంలో రైతుల నుంచే వసూలు చేస్తున్నారు. దీనికితోడు బాక్సుల బాడుగ, హమాలీ కూలీ బాక్సుకు రూ.1. ఇతరత్ర ఖర్చులన్నీ కలుపుకుని రూ.100కు రూ.15లు మార్కెట్‌లోనే పోతోంది. ఇది చాలదన్నట్లు 100బాక్సులకు 5 బాక్సులు లెస్ చేస్తున్నారు. అంటే బాక్సు రూ.100తో అమ్ముడు పోతే.. ఐదు బాక్సులకు రూ.500లు అక్కడ కోత పడుతోంది. ఈ ఖర్చులన్నీ పోయేసరికి రైతులకు ఏమీ మిగలడం లేదు. పంటకోసి కూలీలకు చేతినుంచి ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

సీజన్ ప్రారంభం నుంచి ఇదే దుస్థితి..

ఈ సంవత్సరం జూలై నుంచి టమోటా సీజన్ ప్రారంభమైంది. మార్కెట్‌లో ఏనాడు రైతులకు లాభం చేకూరని పరిస్థితి. గత రెండు నెలల కాలంలో మార్కెట్‌లో 15కిలో బాక్సు రూ.400దాటిన దాఖలాలు లేవు. ప్రస్తుతం బాక్సు రూ.300ల వరకు పలుకుతోంది. అయితే అవి మూడు, నాలుగు లాట్ల కంటే ఎక్కువగా ఉండవనే చెప్పొచ్చు. అవి కూడా మార్కెట్‌లో ధర బాగా పలుకుతోందని చెప్పడానికి మాత్రమేనని ఆయా వర్గాల సభ్యులు చెబుతున్నారు. ఎక్కువ శాతం రూ.50 నుంచి రూ.150లు లోపే ఉంటున్నాయి. ప్రతి రోజు పలికే ధరలే ఇందుకు నిదర్శనం. కనీసం బాక్సు రూ.200పలికినా రైతులకు కొంత ఊరటగా ఉంటుంది. మార్కెట్‌లో ఆ పరిస్థితి లేకపోవడం రైతులకు తీవ్ర వేదన, నష్టాలను మిగుల్చుతోంది.



తోటలో టమోటాను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు



మార్కెట్‌కు వచ్చిన టమోటా

ఇంట్లో వాళ్లు వద్దంటున్నా..



ఇంట్లో వాళ్లు వద్దంటున్నా వినకుండా ఎకరా పొలాన్ని గుత్తకు తీసుకుని టమోటా సాగు చేశా. దాదాపు రూ.50వేలు పెట్టుబడి పెట్టా. పంట బాగానే వచ్చింది. అయితే వర్షానికి పూర్తిగా దెబ్బతింది. అధిక వర్షానికి పొలంలో మూడునాలుగు రోజులు నీళ్లు నిలబడ్డాయి. దీంతో కాయలు తోటలోనే దెబ్బతిన్నాయి. పంట కోయగా 60 బాక్సులయ్యాయి. రూ.1000బాడుగ ఇచ్చి మార్కెట్ తెచ్చా. బాక్సు రూ.రెండు వందలతో అమ్ముడు పోయింది. నాకు ఇంకేం మిగులుతుంది.

- గంగన్న, రైతు, కండ్లపల్లి గ్రామం, పామిడి మండలం

పశువుల మేతకు వదిలేస్తా..

మూడు ఎకరాల్లో పంట సాగు చేశా. రూ.1.5లక్షలు పెట్టుబడి పెట్టా. వర్షాలకు పంట పూర్తిగా దెబ్బతినింది. ఈసారి పంట సాగుకైనా పెట్టుబడులు కూడా దక్కేలే లేవు. పంట దెబ్బతినడంతో పశువుల మేతకు వదిలేయాలని నిర్ణయించుకున్నా.

- పోతిరెడ్డి, రైతు, ఆత్మకూరు

వర్షాల వల్లే...



రెండు ఎకరాల్లో రూ.లక్షకుపైగా పెట్టుబడులు పెట్టి పంట సాగు చేశా. చేతికొచ్చిందనుకునేలోపు వర్షం పంటను దెబ్బతీసింది. వర్షానికి పంట మొత్తం దెబ్బతినింది. కాయలు పనికిరాకుండా పోయాయి. దీనికి తోడు మార్కెట్‌లో ధరలు అంతంతగానే ఉంటున్నాయి. దీంతో పంట సాగు చేయాలన్నా పెట్టుబడులకు భయపడాల్సి వస్తోంది.

- వెంకటరెడ్డి, రైతు, ఆత్మకూరు

నేటి నుంచి రచ్చ రచ్చే..!



ఆటగాళ్లతో మాట్లాడుతున్న త్రీమెన్ కమిటీ సభ్యుడు మాంచో ఫెర్రర్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 4: దులీప్‌ట్రోఫీ టోర్నీ గురువారం నుంచి అనంతపురం క్రికెట్ గ్రౌండ్ వేదికగా జరగనుంది. తొలిమ్యాచ్ ఇండియా-సి, ఇండియా-డి జట్ల మధ్య జరగనుంది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ త్రీమెన్ కమిటీ సభ్యులు మాంచో ఫెర్రర్, ఎన్నికైన కార్యదర్శి సతీష్ అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. ఆయా జట్ల కెప్టెన్లు, ఆటగాళ్లతో మాట్లాడి సదుపాయాల కల్పనపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రేక్షకులు కేటగిరీల వారీగా వాహనాల పార్కింగ్, ఎంట్రీ గేట్లు, గ్రౌండ్‌లో బ్లాక్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, మీడియా కోఆర్డినేటర్ తిమ్మప్ప, దులీప్‌ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు షాబుద్దీన్, జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీఎల్ ప్రకాష్ రెడ్డి, మధు ఆచారి తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు సాధన: దులీప్‌ట్రోఫీలో పాల్గొనే ఇండియా-సి, ఇండియా-డి జట్ల ఆటగాళ్లు అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో రెండో రోజు సాధన చేశారు. బుధవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి 4.30గంటల వరకు ప్రాక్టీస్ చేశారు.

ఇండియా-సి, డి జట్ల మధ్య నేడు తొలి పోటీ

ఈ వస్తువులు తేవద్దు: స్టేడియంలోకి ల్యాప్‌టాప్, కెమెరాలు, అగ్గిపెట్టెలు, బైనాక్యులర్స్, బ్యాటరీలు, బ్యాగులు, బ్యానర్లు, సిగరెట్లు, లైటర్లు, హెల్మెట్లు, నీళ్ల బాటిళ్ల, ఎలక్ట్రానిక్ వస్తువులు, షార్ప్ మెటల్స్ వంటి తదితర వస్తువులను అనుమతి లేదు.

ప్రత్యక్ష ప్రసారం: దులీప్‌ట్రోఫీలో భాగంగా జరిగే ఐదు మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. స్టార్‌స్పోర్ట్స్ 18, జియో చానల్‌లో లైవ్ టెలికాస్ట్ చేయనున్నారు. మొదటి మ్యాచ్ 5 నుంచి 8వతేదీ వరకు ఇండియా-సి, ఇండియా-డి జట్ల మధ్య (ఏ గ్రౌండ్)లో, రెండో మ్యాచ్ 12 నుంచి 15వతేదీ వరకు ఇండియా ఏ-ఇండియా డి (ఏ గ్రౌండ్), మూడో మ్యాచ్ 12నుంచి 15వతేదీ వరకు ఇండియా బి-ఇండియా సి (బి గ్రౌండ్), నాలుగో మ్యాచ్ 19 నుంచి 22వరకు ఇండియా ఏ-ఇండియా సి (ఏ గ్రౌండ్), ఐదో మ్యాచ్ ఇండియా బి-ఇండియా డి(బి గ్రౌండ్)లలో పోటీలు జరగనున్నాయి.



రెండో రోజు సాధన చేస్తున్న క్రీడాకారులు

దులీప్‌ట్రోఫీ ఏర్పాట్లు భేష్

అనంత అభిమానం నచ్చింది

ఇండియా సి, డి జట్ల కెప్టెన్లు రుతురాజ్, శ్రేయస్

నేటి నుంచి మొదటి మ్యాచ్



విలేకరుల సమావేశంలో పాల్గొన్న శ్రేయస్ అయ్యర్, రుతురాజ్ గైక్వాడ్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 4: దులీప్‌ట్రోఫీ నిర్వాహకులు ఏర్పాట్లు చాలా బాగా చేశారని ఇండియా సి, డి జట్ల కెప్టెన్లు రుతురాజ్ గైక్వాడ్, శ్రేయస్ అయ్యర్ పేర్కొన్నారు. దులీప్‌ట్రోఫీకి సంబంధించి బుధవారం స్థానిక అనంత క్రీడాగ్రామంలోని ఆడిటోరియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జాతీయ స్థాయిలో అతిపెద్ద క్రికెట్ టోర్నీ దులీప్‌ట్రోఫీ అని తెలిపారు. అలాంటి టోర్నీలో ఆడే అవకాశం లభించడం అదృష్టమన్నారు. ఈటోర్నీలో ప్రతిభ ఆధారంగానే భారత జట్టులో చోటు దక్కుతుందని పేర్కొన్నారు. యువ క్రీడాకారులకు ఇదో మంచి అవకాశమన్నారు. భారత జట్టులో ఉండే ప్రతి క్రీడాకారుడు కచ్చితంగా ఆడాల్సిన టోర్నీ దులీప్‌ట్రోఫీ అని అన్నారు. జిల్లాలో నెలకొన్న విభిన్న వాతావరణం అద్భుత అనుభూతి కలిగిస్తున్నట్లు వెల్లడించారు. దులీప్‌ట్రోఫీకి స్టార్ క్రికెటర్ సూర్యకుమార్ యాదవ్ హాజరు కాకపోవడాన్ని ప్రశ్నించగా అది తమ పరిధిలోని అంశం కాదని వివరించారు. రెండు రోజుల పాటు ప్రాక్టీస్ సజావుగా జరిగిందన్నారు. అనంతపురం జిల్లా వాతావరణం, ప్రజల అభిమానం తమకు బాగా నచ్చిందన్నారు. కాగా గురువారం నుంచి నాలుగు రోజుల పాటు ఇండియా-సి, ఇండియా-డి జట్ల మధ్య మ్యాచ్ జరగనున్న విషయం తెలిసిందే.

పది గేట్లు ఎత్తేశారు




క్రస్ట్ గేట్ల నుంచి నదికి వెళుతున్న నీరు

రాయదుర్గం, సెప్టెంబరు 4: తుంగభద్ర జలాశయం నిండటంతో క్రస్ట్ గేట్లను ఎత్తి నదికి నీటిని విడుదల చేస్తున్నారు. బోర్డు అధికారులు బుధవారం ఉదయం 10.45 గంటలకు పది క్రస్ట్ గేట్‌లను ఎత్తి 30 వేల క్యూసెక్కులను నదికి వదిలారు. ఎగువ నుంచి 30,419 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి చేరుతోంది. డ్యాంకు మొత్తం 33 క్రస్ట్‌గేట్లు ఉన్నాయి. ఇందులో 19వ క్రస్ట్‌గేట్ కొట్టుకుపోవడంతో స్టాప్‌లాగ్ అమర్చారు. మిగిలిన 32 క్రస్ట్ గేట్‌లలో పదింటిని ఒక్కొక్క అడుగు ప్రకారం ఎత్తి నీటిని నదికి వదులుతున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. కాలువల మరో 15 వేల క్యూసెక్కులను వదులుతున్నారు. జలాశయంలో బుధవారం సాయంత్రం 103.260 టీఎంసీల నీటి నిల్వలు నమోదయ్యాయి. ఎగువ నుంచి వరద ఉధృతి పెరుగుతుందన్న అంచనాతో బోర్డు అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

విద్యార్థులకు మళ్లీ పాఠశాల

- ఐదేళ్ల తర్వాత మళ్లీ పుస్తకాల సరఫరా
- బీసీ వసతి గృహాలకు చేరిన బుక్కులు
- పదో తరగతి చదివేవారికి పంపిణీ
- త్వరలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు...!





ఇంగ్లిష్ మీడియంలో రూపొందించిన పాఠశాల పుస్తకం

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 4: జిల్లాలోని ప్రభుత్వ బీసీ సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థులకు 'పాఠశాల' పుస్తకాలు మళ్లీ వచ్చాయి. పదో తరగతి విద్యార్థుల కోసం బయటి మార్కెట్‌లో నెలవారి సిలబస్ మేరకు అన్ని సబ్జెక్టుల్లోని అంశాలను క్రోడీకరించి పాఠశాల పేరుతో ప్రతి నెలా ఓ పుస్తకం విడుదలవుతోంది. ఇది ఎంతో ఉపయోగకరంగా ఉండటంతో గత టీడీపీ పాలనలో అధికారులు సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు అందించేవారు. దీన్ని చదివి ఎంతో మంది విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ పుస్తకాల పంపిణీకి మంగళం పాడింది. దీంతో ఎంతో మంది విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. అయితే ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మరోసారి ఈ పాఠశాల పుస్తకాలను హాస్టళ్లకు పంపిణీ చేయడం ప్రారంభించింది. బయటి మార్కెట్‌లో రూ.60లు ఉన్న పుస్తకాన్ని ప్రభుత్వం హాస్టళ్లలోని విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేస్తోంది. ప్రస్తుతం పదో తరగతి విద్యార్థులకు సిలబస్ ప్రకారం ఆగస్టు నెల పాఠశాల పుస్తకాలను అందజేశారు. దీంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తెలుగు, ఇంగ్లిషులో ముద్రణ...

ప్రభుత్వ వసతిగృహాల్లో వసతి పొందుతున్న పదో తరగతి విద్యార్థుల కోసం 'పాఠశాల' పుస్తకాలను పంపిణీ చేసింది. ఇప్పటికి మూడు నెలల సిలబస్ పూర్తి కావడంతో అందుకనుగుణంగా పరీక్షలు నిర్వహిస్తారు. ఈక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలల సిలబస్‌కు సంబంధించి అన్ని సబ్జెక్టుల సారాంశాలను పాఠశాల పుస్తకంలో నిక్షిప్తం చేసి ముద్రించిన పుస్తకాలను విద్యార్థులకు అందజేసింది. తెలుగు, ఇంగ్లిష్ భాషలలో రెండు రకాల పుస్తకాలను పంపిణీ చేసింది. జిల్లాలోని మూడు డివిజన్లలో పదో తరగతి విద్యార్థులకు దాదాపు 800 పుస్తకాలను పంపిణీ చేసింది. బీసీ సంక్షేమశాఖాధికారులు ఆ పుస్తకాలను సంబంధిత వార్డెన్లకు అందించారు. అయితే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వసతిగృహాలకు ఇంతవరకూ పుస్తకాలు విడుదల కాలేదు. ఆయా సంక్షేమశాఖల అధికారుల ద్వారా అందిన సమాచారం మేరకు విడతల వారీగా పుస్తకాలు విడుదల అవుతాయి కాబట్టి మలివిడతలో వచ్చే అవకాశం ఉంది. ఇంతవరకు తమకు అందిన పుస్తకాలను డివిజన్ల వారిగా బీసీ సంక్షేమ హాస్టళ్లకు అందించినట్లు బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల డీడీ కుష్బూ కొఠారీ తెలిపారు.

వికసిత్ ఆంధ్రా ప్రణాళికలు రూపొందించాలి

- ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 4: వ్యవసాయ, అనుబంధ శాఖలకు సంబంధించి వికసిత్ ఆంధ్రా ప్రణాళికలు పక్కాగా రూపొందించాలని ఏపీఎంఐపీ పీడీ, మాస్టర్ ట్రైనర్ రఘునాథ్‌రెడ్డి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులతో వర్క్‌షాప్ నిర్వహించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల పరంగా రాబోవు ఐదేళ్లలో స్థూల ఆదాయం 15 శాతం పెంచేందుకు ప్రస్తుతం చేస్తున్న, చేయనున్న పనులపై ప్రణాళికలు సిద్ధం చేయడంపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు, పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి, పట్టు పరిశ్రమ శాఖ జేడీ ఆంజనేయులు, ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్ ఖాన్ పాల్గొన్నారు.

గుంతకల్లు- చిక్కజాజూర్ ప్యాసింజరు రైలు రద్దు

గుంతకల్లు, సెప్టెంబరు 4: గుంతకల్లు- చిక్కజాజూర్-గుంతకల్లు ప్యాసింజరు రైలు నెం(07586/85)ను ఈ నెల 8వ తేదీ నుంచి నెలపాటు రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సౌత్ ఈస్ట్రన్ రైల్వేలోని బిలాస్‌పూర్ రైల్వే డివిజన్‌లో జరుగుతున్న నాన్-ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా గుంతకల్లు-చిక్కజాజూర్ మధ్యన నడిచే ప్యాసింజర్ అప్ అండ్ డౌన్ సర్వీసులను ఈ నెల 8వ తేదీ నుంచి అక్టోబరు 6వ తేదీ వరకూ రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని గమనించి ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.



సోలకుంట్ల రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్లపొదలు

రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలు

కదిరి (అమడగూరు), సెప్టెంబరు 4 : మండలంలోని బలకవారిపల్లి మీదుగా సోలకుంట్లకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపుల ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. రాత్రి సమయంలో ప్రయాణం చేయాలంటేనే భయంగా ఉందన్నారు. అధికారులు స్పందించి రహదారికి ఇరువైపుల పెరిగిన ముళ్లపొదలు తొలగించాలని కోరుతున్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



ఓడీసీలో విరాళాలు సేకరిస్తున్న సచివాలయ సిబ్బంది

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 4 : వరద బాధితల కోసం సచివాలయ ఎంప్లాయిస్ యూనియన్ ఓడీ చెరువు ఆధ్వర్యంలో బుధవారం విరాళాలు సేకరించారు. స్థానిక సచివాలయం నుంచి ప్రధాన వీధుల గుండా కార్యదర్శి రామలింగారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది రూ.22,779ను విరాళాలుగా సేకరించారు. ఈ మొత్తాన్ని సీఎం సహాయనిధికి పంపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది హరి, ఓం ప్రకాష్, సలీమ్, కాంతమ్మ, తేజశ్రీ, తేజశ్వనీ, చౌడప్ప, వెంకటేష్, శ్రీనివాసులు, దిలీప్ పాల్గొన్నారు.

పవన్ విరాళంపై హర్షం

తాడిమర్రి, సెప్టెంబరు 4 : కృష్ణా జిల్లాలో వరద ప్రభావానికి గురైన 400 గ్రామపంచాయతీలు ఒక్కో దానికి రూ. లక్ష చొప్పున మొత్తం రూ. నాలుగు కోట్లను ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ విరాళం ప్రకటించడంపైఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్ బుధవారం హర్షం వ్యక్తం చేశారు. అలా ప్రతి ఒక్కరూ విరాళాలు ఇవ్వడానికి ముందుకురావాలన్నారు.

12న చేనేత కార్మికుల ధర్నా

ధర్మవరం, సెప్టెంబరు 4 : బత్తలపల్లి మండలం వేల్పుమడుగు వద్ద ఉన్న జేఆర్ సిల్క్ ఫ్యాక్టరీ వద్ద ఈ నెల 12న ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక కదిరిగేటు సమీపంలోని నేతన్న విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో పాలకులు పవర్‌లూమ్స్ మగ్గాలను విచ్చలవిడిగా ప్రోత్సహించడంతో ధర్మవరంలో చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. చేనేత కార్మికుల ఉపాధిపై దెబ్బకొట్టారన్నారు. చేనేత మంత్రి సవిత, మంత్రి సత్యకుమార్ ధర్మవరంలో ఎదురుక్కొంటున్న చేనేత సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం సహాయ కార్యదర్శి చెన్నంపల్లి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు చట్టా రవి, సీపీఐ పట్టణ కార్యదర్శి రవి, ఏఐటీయూసీ నాయకులు రమణ, జిల్లా కార్యవర్గసభ్యులు ఆదినారాయణ, బాబు, శ్రీధర్, శ్రీనివాసులు, ఓబిలేసు, బాలరంగయ్య, సురేశ్ పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 4 : ఏపీ రాష్ట్ర న్యాయసేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు జాతీయ లోక్ అదాలత్‌ను ఈనెల 14న నిర్వహిస్తున్నట్లు ధర్మవరం కోర్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి, చైర్మన్ గీతావాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు, పోలీసులు, న్యాయవాదులు, బ్యాంకు రుణాల పెండింగ్ ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజీ కావాల్సిన సివిల్, క్రిమినల్ ఇతర కేసులను ఈ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని తెలిపారు.

నిందితుడి అరెస్టు

నల్లమాడ, సెప్టెంబరు 4: స్థానిక సర్కిల్ కార్యాలయంలో కంప్యూటర్‌ను చోరీ చేసిన నిందితుడిని బుధవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నరేంద్రరెడ్డి తెలిపారు. గత నెల 20వ తేదీ రాత్రి సర్కిల్ కార్యాలయంలో కంప్యూటర్‌ను చోరీ చేశారన్నారు. ఇన్‌చార్జి ఎస్ఐ వెంకటనారాయణ దర్యాప్తు చేయగా నల్లమాడ వైఎస్ఆర్ సర్కిల్‌లో నిందితుడిని సాయికుమార్‌ను అరెస్టు చేశారు. విచారించి చోరీ చేసిన కంప్యూటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి, పుట్టపర్తి కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఏఐవైఎఫ్ కమిటీ ఏకగ్రీవం

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 4: స్థానిక ఎన్‌జీఓ కార్యాలయంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణ నూతన కమిటీని బుధవారం ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా ఎస్.లోకేష్, ఉపాధ్యక్షులుగా రమణ, తిరుమలేష్, ప్రధాన కార్యదర్శిగా వరుణ్, సహాయ కార్యదర్శులుగా ఏ.నిఖిల్, బాలాజీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగభృతి ఇవ్వాలని, డీఎస్సీ పరీక్షలను ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సకలరాజా, సీపీఐ నియోజకవర్గ అధ్యక్షుడు ముసుగుమధు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 4: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఉగ్గిరెడ్డిపల్లిలో దాదాపు 60 రకాల పౌష్టికాహారం, ఆకుకూరలతో ప్రదర్శనలో నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారాల గురించి ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు లక్ష్మీ, ప్రమీల, లక్ష్మీప్రియ, షమీమ్, పార్వతమ్మ, శ్యామలమ్మ, వెంకటనరసమ్మ, సుకన్య స్వర్ణలత, ఇందిరమ్మ పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండలంలోని మల్లమీదపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాబాఫక్రుద్దీన్, సూపర్‌వైజర్ పార్వతమ్మ, కార్యకర్తలు లక్ష్మీదేవి, సరస్వతి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

తోలుబొమ్మల కళాకారిణికి సన్మానం

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 4 : శిల్పగురు జాతీయ అవార్డు అందుకున్న మండలంలోని నిమ్మలకుంట గ్రామానికి చెందిన తోలుబొమ్మల కళాకారుణి దళవాయి శివమ్మను బుధవారం ఘనంగా సన్మానించారు. బుధవారం మంత్రి సత్యకుమార్‌యాదవ్ కార్యాలయ సిబ్బంది ఆ గ్రామానికి వెళ్లి సన్మానించారు. ఇందులో మంత్రి పీఏలు హరీష్, మల్లికార్జున, బీజేపీ నాయకులు డోలా రాజారెడ్డి, చెర్లోపల్లి నారాయణస్వామి పాల్గొన్నారు.



దళవాయి శివమ్మను సన్మానిస్తున్న సిబ్బంది

రైతులకు కరెంట్ కష్టాలు

ట్రాన్స్‌ఫార్మర్‌లు ఇచ్చారు
కనెక్షన్లు మరిచారు

నంబులపూలకుంట, సెప్టెంబరు 4 : మండలంలో అనేక మంది రైతులు విద్యుత్ కనెక్షన్ల కోసం నెలల తరబడి ఎదురుచూస్తున్నారు. మండలంలో 42 మంది రైతులు ట్రాన్స్‌ఫార్మర్ కోసం, మరికొంత మందికి విద్యుత్ స్తంభాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్ స్తంభాలు ఇచ్చారు. స్తంభాలను రైతులు పొలాల్లో నాటు కున్నారు. కనెక్షన్ కోసం విద్యుత్ వైర్లు, కండెన్సర్ ఇవ్వకపోవడంతో రోజూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కార్యాలయంలో అధికారులు అందుబాటులో ఉండటంలేదు. స్థానిక సిబ్బందిని ప్రశ్నిస్తే ఏదో ఒక సమాధానం చెప్పి దాట వేస్తున్నారని బాధిత రైతులు వాపోతున్నారు. కొంతమంది రైతులు సబ్ స్టేషన్‌కు వచ్చిన ట్రాన్స్‌ఫార్మర్‌లను రైతులు ఇంటివద్దకు తీసుకెళ్లగా... మరికొంతమంది రైతులు పొలాల్లో ఉంచుకున్నారు. మరి కొంత మంది రైతులు వైర్ల కోసం ఎదురు చూస్తున్నారు. మరి కొంతమంది రైతులు ప్రైవేటు దుకాణాల్లో విద్యుత్ వైర్లు, కండెన్సర్ కొనుగోలు చేసుకుని కనెక్షన్ కోసం ఎదురు చూస్తున్నారు. కొంతమంది రైతులు చేసిన అప్పులకు కనీసం



ఎన్పీకుంట విద్యుత్ కార్యాలయం



ఇంటి వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపిస్తున్న సోమిరెడ్డి

వడ్డీలు కట్టుకోవచ్చని... పక్క బోరు రైతుల నుంచి విద్యుత్ కనెక్షన్ తీసుకుని పంటలు సాగు చేసుకొంటున్నట్లు చెబుతున్నారు. అయితే మరో పంట సాగుచేద్దామనుకుంటే విద్యుత్ కనెక్షన్ ఇచ్చిన రైతులు వారికి లోడ్ ఎక్కువ అవుతోందని వెంటనే కనెక్షన్ తీసివేయాలని చెబుతున్నట్లు వాపోతున్నారు. కనీసం రబీలో పంటలు సాగుచేసుకోవడానికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పరికరాలు లేవు

సబ్‌స్టేషన్‌కు వచ్చిన డీపీలను మంజూరైన రైతులకు అందించాం. వాటి ఏర్పాటుకు అవసరమైన పరికరాల కోసం నివేదికలు పంపాం. మంజూరైన వెంటనే ముందుగా దరఖాస్తు చేసుకున్నవారికి అందజేస్తాం. విడతల వారీగా ఈనెలలో పరికరాలు పూర్తిగా అందజేస్తాం.

-సాలేహబాషా, విద్యుత్ ఇంజనీర్, ఎన్పీకుంట

కాపలా ఉంటున్నాం

మంజూరైన డీపీని సబ్‌స్టేషన్ నుంచి తీసుకున్నాం. పొలంలో డీపీని ఉంచితే దొంగలు ఎత్తుకెళ్తారనే భయంతో ఇంటి వద్దనే ఉంచుకున్నా. నెలరోజులు అవుతున్నా కేబుల్, కండెన్సర్ ఇవ్వలేదు. డీపీకి కాపలా ఉంటున్నాం. హైదరాబాద్‌కు ఉపాధి కోసం వెళ్లి తిరిగి వచ్చాం. పంటలు సాగుచేసుకుద్దామనుకుంటే విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం లేదు. విద్యుత్ కార్యాలయం చుట్టు తిరిగినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి

- సోమిరెడ్డి, చీలమచెరువుపల్లి

తాత్కాలికంగా కనెక్షన్ తీసుకున్నా



నాకు మూడు ఎకరాల మెట్ట భూమి ఉంది. అందులో బోరు వేశాను. నీరు సమృద్ధిగా పడింది. సకాలంలో విద్యుత్ వైర్లు ఇవ్వకపోవడంతో డీపీని దొంగలు ధ్వంసం చేస్తారని, పక్క రైతులను అడిగి విద్యుత్ కనెక్షన్ తీసుకున్నా. లోడ్ ఎక్కువ అవుతోందని ఆ రైతు కనెక్షన్ తొలగించాడు. ఇప్పటికైనా అధికారులు డీపీకి కనెక్షన్ ఇవ్వాలి

- చిన్నవెంకటరమణారెడ్డి, ఎర్రవంకలవారిపల్లి

డీపీ ఇవ్వలేదు



ఈ యేడాది మొదటిలో విద్యుత్ కనెక్షన్ కోసం రూ.36 వేలు డీడీ చెల్లించాం. స్తంభాలిచ్చారు. పొలంలో నాటుకున్నాం. డీపీ కోసం ప్రతిరోజు కార్యాలయానికి వెళ్తున్నా ఫలితం లేదు. పలుమార్లు అధికారులను విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా నాకు డీపీ, కేబుల్‌వైరు, కండెన్సర్ ఇచ్చి, విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలి.

- వెంకటరమణ, వంకమద్ది

జగనన్న కాలనీని పరిశీలించిన ఎమ్మెల్యే

కదిరి అర్బన్, సెప్టెంబరు 4 : మున్సిపల్ పరిధిలోని ఎర్రగుట్టపల్లి జగనన్న కాలనీని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, హౌసింగ్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ లేఅవుట్‌లో లబ్ధిదారుల కన్నా.. ఆక్రమణదారులే ఎక్కువయ్యారు. దీనిపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో మంగళవారం కట్టుకున్నోళ్లకు కట్టుకున్నంత అనే శీర్షికతో ఓ కథనాన్ని ప్రచురించింది. దీంతో ఎమ్మెల్యే ఆ కాలనీలో పర్యటించి.. అక్రమాలపై ఆరా తీశారు.

ఆయన మాట్లాడుతూ.. ఈ జగనన్న లేఅవుట్‌లో వైసీపీ మద్దతు దారులు పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడి ఒకొక్కరు రెండు, మూడు సెంట్లలో షాపింగ్ కాంపెక్సులు, భవంతులు కట్టుకున్నారన్నారు. వీటిపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.



కాలనీ లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

రక్షక తడులు ఇవ్వడానికి సిద్ధంకండి : ఏపీఎఫ్

తనకల్లు, సెప్టెంబరు 4 : మండలంలోని మల్లిరెడ్డిపల్లి, తవళం, గేమేనాయక్‌తండా, చీకటిమానుపల్లి పంచాయతీల్లో ఎంపిక చేసిన 19 గ్రామాల్లో సాగుచేసిన ప్రతి చేనుకు రక్షకతడులు అందేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఏపీఎఫ్ (అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్) ప్రతినిధి వాటర్ ఎక్స్‌పర్ట్ నిఖిల్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గౌళ్లపల్లి వద్ద ఖరీఫ్‌లో వర్షాధారం కింద బీడు భూముల్లో రైతులు సాగుచేసిన సజ్జ, కొర్ర, వేరుశనగ తదితర పంటలను పరిశీలించిన ఆయన మాట్లాడారు. పురుగుమందులు, రసాయన ఎరువులు లేని వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. ద్రవజీవామృతం యూని ట్లను పరిశీలించారు. ఆయన వెంట వాసన్ సంస్థకు చెందిన రీసోర్సు పర్సన్ చంద్రశేఖర్, జనజాగృతి అధ్యక్షులు బలరాం, ప్రాజెక్టు మేనేజర్ రాంప్రసాద్, న్యాచురల్ ఫామింగ్ ఎక్స్‌పర్టు సుప్రీయ, జనజాగృతి సిబ్బంది, గౌళ్లపల్లి, మల్లిరెడ్డి, నడిమికుంటపల్లి, పెద్దపల్లి గ్రామాల రైతులు తదితరులు ఉన్నారు.



బీడు భూములో సాగుచేసిన వేరుశనగ పరిశీలిస్తున్న ప్రతినిధులు

మధ్యాహ్న భోజనంపై అవగాహన

నల్లచెరువు, సెప్టెంబరు 4 : స్థానిక ఎమ్మార్సీ భవనంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల కమిటీ ఛైర్మన్లు, సచివాలయ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌కు మధ్యాహ్న భోజనంపై ఎంఈఓ తిరుపాల్‌నాయక్, ఎంపీడీఓ శకుంతల అవగాహన కల్పించారు. డొక్కా సీతామ్మ మధ్యాహ్న భోజనం నాణ్యతంగా ఉండేలా చూడాలని సూచించారు. ప్రతి సోమ, గురువారం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, బుధ శుక్రవారాల్లో పాఠశాల యజమాన్య ఛైర్మన్లు పాఠశాలను సందర్శించి, భోజనం నాణ్యతను పరిశీలించాలన్నారు. అలాగే పాఠశాలలో మరుగుదొడ్ల నాణ్యతను పరిశీలించి, యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

ద్విచక్రవాహనం బోల్తా - వ్యక్తికి గాయాలు

నల్లచెరువు: స్థానిక బసవన్నకట్ట సమీపంలో బుధవారం ద్విచక్రవాహనం అదుపుతప్పి.. బోల్తా పడటంతో కొత్తకమ్మవారిపల్లికి చెందిన శివ తీవ్రంగా గాయపడ్డాడు. అతను బైక్‌పై నల్లచెరువుకు సొంత పనులపై వచ్చి తిరిగి వెళ్తుండగా.. ఈ ప్రమాదం జరిగింది. గాయపడ్డ అతన్ని నల్లచెరువు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చౌకధాన్యపు డిపో ప్రారంభం

ఓబుళదేవరచెరువు : మండలంలోని డబురవారిపల్లిలో చౌకధాన్యపు డిపోను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి బుధవారం ప్రారంచారు. వారు మాట్లాడుతూ.. సరుకులు సక్రమంగా పంపిణీ చేయకుండా అవినీతికి పాల్పడితే వారి డీలర్ షిప్ రద్దు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ రంగనాయకులు, కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, మాజీ జెడ్పీటీసీ పిట్టా ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

గాండ్లపెంట : మండలంలోని వేపరాలలో రైతు డేరంగల శ్రీరాముల పొలంలో ప్రకృతి వ్యసాయంపై రైతులకు ఎస్‌డీపీ నరేంద్రారెడ్డి బుధవారం అవగాహన కల్పించారు. ప్రపంచదేశాలు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపుతున్నాయన్నారు. ప్రతి రైతు రసాయనాలు లేని పంటలు పండించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం తిరుపతి జిల్లా నుంచి వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, శ్రీకాకుళం నుంచి సింహాచలం, షణ్ముకరావ్, సుధాకర్‌రెడ్డి, విజయ్, సీసీ మోహర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఎస్ఐగా వెంకటరాముడు



ధర్మవరంరూరల్ : పుట్టపర్తి పోలీస్‌స్టేషన్ ఎస్ఐ వెంకట రాముడును ధర్మవరం ట్రాఫిక్ ఎస్ఐగా నియమించారు. బుధవారం పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, ప్రజలంతా ట్రాఫిక్ నియమాలు పాటించాలని తెలిపారు.

తాగునీటి కార్మికులకు సీఐటీయూ మద్దతు

కదిరి అర్బన్ : జిల్లా వ్యాప్తంగా సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగు నీటి సరఫరా పథకంలో పనిచేస్తున్న కార్మికుల డిమాండ్ల పరిష్కా రానికి తలపెట్టిన సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఇస్తున్న ట్లు నాయకులు జగన్మోహన్, ముస్తాక్ తెలిపారు. ఉమ్మడి అనం తపురం జిల్లాలో తాగునీటి పథకంలో 1300 మంది కార్మికులు పని చేస్తున్నారని, వారికి జీతాలు, పీఎస్, ఇఎస్ఐ చెల్లించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

గాండ్లపెంట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీ నం చేసుకున్నట్లు ఎస్ఐ క్రిష్ణవేణి బుధవారం తెలిపారు. ఎన్పీకుంట మండలంలోని ధనియార్‌చెరువులో ఇసుకను తీసుకుని కదిరికి తరలిస్తుండగా.. స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ట్రాక్టర్‌ను తహసీల్దార్ వేణుగోపాల్‌కు అప్పగిస్తామన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

ధర్మవరం : కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన కేసులో దోషులను గురువారం కోర్టు కఠినంగా శిక్షపడేలా చూడాలని ప్రగతి శీల విద్యార్థి సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో బుధవారం రాత్రి విద్యార్థులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు నందకిశోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

నల్లమాడ : మండలంలోని రెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలో ఎయిడ్స్ కట్టడిపై బుధవారం అవగాహన కల్పించారు. రెడ్డిపల్లి వైద్యుడు గణేనాయక్ మాట్లాడుతూ... ఎయిడ్స్ అంటు వ్యాధి కాదన్నారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జంషీర్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, వైద్యసిబ్బంది, జనజాగృతి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో హోంగార్డు మృతి

బత్తలపల్లి, సెప్టెంబరు 4 : బత్తలపల్లి పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డు ఆంజనేయులు మంగళవారం రాత్రి గుండె పోటుతో మరణించాడు. ఇతని స్వగ్రామం ముదిగుబ్బ మండలం దొరిగల్లు. కొన్ని సంవత్సరాలుగా హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. రోజువారి లాగే అతను విధులు ముగించుకొని మంగళవారం రాత్రి ఇంటికి వెళ్లి నిద్రపోయాడు. బుధవారం తెల్లావారుజామున నాలుగు గంటలకు అతని భార్య లేపేందుకు ప్రయత్నించింది. అతనిలో చలనం లేకపోవడంతో సమీపంలో ఉన్న బంధువులకు సమాచారం అందించింది. వారు వచ్చి చూడగా.. ఆంజనేయులు గుండెపోటుతో మరణించినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ప్రభాకర్, ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది ఆ గ్రామానికి వెళ్లి అతని మృతదేహనికి నివాళులర్పించారు. భార్య జయమ్మకు పోలీస్ శాఖ తరుపున రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆంజనేయులుకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.



ఆంజనేయులు మృతదేహానికి నివాళులర్పిస్తున్న డీఎస్పీ

అక్రమంగా ఇసుక తరలింపు



అక్రమంగా తరలిస్తున్న ఇసుక

గాండ్లపెంట, సెప్టెంబరు 4 : మండలంలోని పలు గ్రామాల్లోని వాగులు, వంకల్లోని ఇసుకను అక్రమంగా యథేచ్ఛగా తరలిస్తున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నుంచే పలు వాహనాల్లో ఇసుకను అక్రమంగా కదిరి ప్రాంతానికి తరలిస్తున్నా.. అధికారులు నామమాత్రంగా ఒకటో.. రెండో వాహనాలను స్వాధీనం చేసుకొని చేతులు దులుపుకొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి ఈ ప్రాంత ం ఇసుక... ఈ ప్రాంతవాసులకే ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకోండి

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 4: వర్షాభావ పరిస్థితుల వల్ల పంట పెట్టని రైతులు ప్రత్యామ్నాయ విత్తనాల కోసం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ ముస్తఫా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో ఉలవలు, పెసలు, అలసందలు విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు రిజిస్ట్రేషన్ చేసుకుంటే త్వరలోనే పంపిణీ చేస్తామన్నారు. ఉలవలు 10 కేజీలు రూ.174, పెసలు 4 కేజీలు ధరరూ. 104, అలసందలు 10 కేజీలు రూ. 226గా ధరలు నిర్ణయించినట్లు తెలిపారు. పంట వేసిన తర్వాత ఈ-పంటలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు.



ఉప్పునేసినపల్లిలో దోమలనివారణకు పిచికారీ చేయిస్తున్న సర్పంచ్, సెక్రటరీ

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 4: మండలంలోని ఉప్పునేసినపల్లి గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. బుధవారం సర్పంచ్ ముత్యాలప్పనాయుడు ఆధ్వర్యంలో గ్రామంలో వీధివీధినా దోమలనివారణ మందును పిచికారీ చేసి పరిసరాలను శుభ్రం చేయించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని సర్పంచ్ అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సౌందర్య పాల్గొన్నారు.

చెత్త తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కాలువలోని వ్యర్థాలను తొలగిస్తున్న కార్మికులు

నంబులపూలకుంట, సెప్టెంబరు 4 : స్థానిక నాలుగురోడ్లు కూడలి, బస్‌షెల్టర్, చిరు దుకాణాలు ఉన్న ప్రదేశంలో మురుగు కాలువ ప్లాస్టిక్ వ్యర్థాలు, పూడికతో నిండిపోయింది. దీంతో మురుగునీరు నిల్వ ఉండటంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. దీనిపై ఆంధ్రజ్యోతి దినపత్రిక ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన ఎంపీడీఓ మనోహర్‌బాబు, సర్పంచ్ ఆంజనమ్మ, పంచాయతీ అధికారులు బుధవారం ఆ కాలువలో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని కార్మికుల ద్వారా తొలగించారు. నిలువ ఉన్న మురుగునీరు వెళ్లేలా పనులు చేపట్టారు. చుట్టుపక్కల దుకాణదారులు వ్యర్థాలను కాలువలో వేయకూడదని సూచించారు.

నేడు సర్వసభ్య సమావేశం

కొత్తచెరువు, సెప్టెంబరు 4 : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని గురువారం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బారాన్‌సాబ్ ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి విచ్చేస్తారన్నారు. సమావేశంలో రెవెన్యూ, వ్యవసాయం, ఉపాధి హామీ, గృహనిర్మాణం, విద్య, వైద్యం, తాగునీరు తదితర 16 శాఖలపై చర్చిస్తామన్నారు. ఇందుకు సంబందించి మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

ఓబుళదేవరచెరువులో...

ఓబుళదేవరచెరువు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వరలక్ష్మీ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ తుమ్మల పర్వీన్‌షామీర్ అధ్యక్షతన నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశానికి అన్నిశాఖల అధికారులు, ప్రతినిధులు, కో-ఆప్షన్ సభ్యులు తప్పకుండా హాజరుకావాలన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు శ్రీకారం

ధర్మవరం, సెప్టెంబరు 4 : బీజేపీ జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని స్థానిక మారుతి రాఘవేంద్రస్వామి కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. మంత్రి సత్యకుమార్ ప్రాతినిత్యం వహిస్తున్న ధర్మవరం నియోజకవర్గాన్ని సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలబెట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, రాష్ట్ర కార్యదర్శి బాలక్రిష్ణయాదవ్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు దేవానంద్, జాతీయ కౌన్సిల్ అంబటి సతీశ్, ప్రధాన కార్యదర్శులు అమర్, మేకల శ్రీనివాస్, సభ్యత్వ నమోదు ప్రముఖ్ రమణమూర్తి, సహ ప్రముఖ్ సాకే ఓబిలేసు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాపు రామచంద్రారెడ్డి

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 4: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ గంగాదేవి, కార్యదర్శి రామాంజినేయులు సూచించారు. సోమందేపల్లి మండలంలోని పాపిరెడ్డిపల్లిలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం టైఫాయిడ్, మలేరియా, డెంగీలాంటి విషజ్వరాలు ప్రబలుతున్నాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరం వచ్చిన వెంటనే ఆసుపత్రిలో చికిత్స పొందాలన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరిగి సీజనల్ వ్యాధులపట్ల అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది రవికుమార్, పారిశుధ్య సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పెయ్య దూడలను ఇవ్వగలిగే లింగనిర్ధారణపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న పశు వైద్యులు

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 4: పెయ్యి దూడలను మాత్రమే ఇవ్వగలిగే లింగనిర్ధారణ, వీర్యం వినియోగంపై పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని మండల పరిధిలోని మణేసముద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ రైతులకు అవగాహన కల్పించారు. పెయ్యి దూడలు మాత్రమే పుట్టే వీర్యకణాలను ప్రవేశపెట్టి కృత్రిమ గర్భనిర్ధారణ చేయగలిగే సాంకేతికత అందుబాటులో ఉందన్నారు. రెండు ఇంజక్షన్ల ఖరీదు రూ. 1350 కాగా రూ. 850 సబ్సిడీ పోను కేవలం రూ.500కే లభిస్తాయన్నారు. వీటితో 20 శాతం అధిక పాలనిచ్చే శక్తి ఆవుకు వస్తుందన్నారు. ఈ సందర్భంగా పాడి పశువులను పరిశీలించి రైతులకు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పశు వైద్యులు పెంచలయ్య, పి నీరజ, దీపిక, రాధిక, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

మడకశిర రూరల్, సెప్టెంబరు 4: మండలంలోని వైబీ హళ్లి ఉన్నత పాఠశాలలో జనసేన నాయకులు బుధవారం విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీచేశారు. జనసేనపార్టీ నాయకుడు కళ్యాణ్, పట్టణ ఉపాధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఆ పాఠశాలలో మొక్కలు నాటారు, అనంతరం విద్యార్థులందరికి నోటుపుస్తకాలను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు రవీంద్రరెడ్డి, ఎంఈఓ భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల శాతాన్ని పెంచాలి: ఏపీఓ

రొళ్ల, సెప్టెంబరు 4: మండలంలోని ప్రతి పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీల శాతాన్ని పెంచాలని ఏపీఓ ఓబులప్ప పేర్కొన్నారు. రొళ్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహిం చారు. ఈసందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలోనూ వంద రోజుల పనిదినాలు కల్పించి ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 4 : సోమందేపల్లి మండలంలోని నల్గొండరాయనపల్లిలో టీడీపీ కార్యకర్త గొల్ల రాంగోపాల్ (39) మంగళవారం వ్యవసాయ పొలంలో పాముకాటుకు గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి సవిత భర్త వెంకటేశ్వర్ రావు పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని రాంగోపాల్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలువేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. టీడీపీ నాయకులు కోనాపురం రామలింగ, దాదు, రామక్రిష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళపై టీడీపీ నాయకుడి అత్యాచారయత్నం

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 4: రొద్దం మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళపై అత్యాచారయత్నం జరిగింది. పని నిమిత్తం తమ గ్రామానికి చెందిన టీడీపీ మైనార్టీ నాయకుడి తో కలిసి ఆమె రొద్దం తహసీల్దార్ కార్యాలయానికి మంగళవారం వెళ్లారు. తిరుగు ప్రయాణం చేసే సమయంలో, మార్గ మధ్యంలో ఓ పొలంలోకి తీసుకెళ్లి మహిళపై ఆ నాయకుడు లైంగికదాడికి యత్నించాడు. ఆమె కేకలు వేయడంతో పారిపోయాడు. బాధిత మహిళ గ్రామానికి చేరుకుని ఆ నాయకుడి ఇంటివద్దకు వెళ్లి జరిగిన విషయం తెలిపింది. ఈ వ్యవహారం గురించి తెలుసుకున్న సీఐ రాఘవన్, ఎస్ఐ వలీబాష తమ సిబ్బందితో కలిసి బుధవారం గ్రామానికి వెళ్లి బాధిత మహిళను విచారించారు. ఫిర్యాదు చేయడానికి బాధితురాలి కుటుంబ సభ్యులు నిరాకరించారని సీఐ తెలిపారు.

ప్రధానోపాధ్యాయుడి మృతి

హిందూపురం(పరిగి), సెప్టెంబరు 4 : పరిగి మండలంలోని సేవామందిరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్ రావు(60)గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందినట్లు ఎంఈఓ లక్ష్మీదేవి తెలిపారు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయ బృందం స్థానిక విద్యానగర్‌లోని మృతుడి నివాసం వద్దకు వెళ్లి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. పరిగి పాఠశాల హెచ్ఎం కృపాసత్యరాజ్ సంతాపం తెలిపారు.

గుండె పోటుతో హోంగార్డు మృతి

బత్తలపల్లి, సెప్టెంబరు 4 : బత్తలపల్లి పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డు అంజనేయులు మంగళవారం రాత్రి గుండె పోటుతో మరణించాడు. ఇతని స్వగ్రామం ముదిగుబ్బ మండలం దొరిగల్లు. కొన్ని సంవత్సరాలుగా హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. రోజువారి లాగే అతను విధులు ముగించుకొని మంగళవారం రాత్రి ఇంటికి వెళ్లి నిద్ర పోయాడు. బుధవారం తెల్లావారుజామున నాలుగు గంటలకు అతని భార్య లేపేందుకు ప్రయత్నించింది. అతనిలో చలనం లేకపోవడంతో సమీపంలో ఉన్న బంధువులకు సమాచారం అందించింది. వారు వచ్చి చూడగా.. అంజనేయులు గుండెపోటుతో మరణించినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ప్రభాకర్, ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది ఆ గ్రామానికి వెళ్లి అతని మృతదేహనికి నివాళులర్పించారు. భార్య జయమ్మకు పోలీస్ శాఖ తరుపున రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అంజనేయులుకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

ద్విచక్రవాహనం బోల్తా - వ్యక్తికి గాయాలు

నల్లచెరువు : స్థానిక బసవన్నకట్ట సమీపంలో బుధవారం ద్విచక్రవాహనం అదుపుతప్పి.. బోల్తా పడటంతో కొత్తకమ్మవారిపల్లికి చెందిన శివ తీవ్రంగా గాయపడ్డాడు. అతను బైక్‌పై నల్లచెరువుకు సొంత పనులపై వచ్చి తిరిగి వెళ్తుండగా.. ఈ ప్రమాదం జరిగింది. గాయపడ్డ అతన్ని నల్లచెరువు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

గాండ్లపెంట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీ నం చేసుకున్నట్లు ఎస్ఐ క్రిష్ణవేణి బుధవారం తెలిపారు. ఎన్పీకుంట మండలంలోని ధనియార్‌చెరువులో ఇసుకను తీసుకుని కదిరికి తరలిస్తుండగా.. స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ట్రాక్టర్‌ను తహసీల్దార్ వేణుగోపాల్‌కు అప్పగిస్తామన్నారు.

శాంతి పురంగా పేరుతెద్దాం

కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ రత్న



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 4: హిందూపురాన్ని శాంతి పురంగా పేరు తీసుకురావాలని జిల్లా ఎస్పీ రత్న పేర్కొన్నారు. వినాయక నిమజ్జనం శాంతి యుతంగా జరపాలని సూచించారు. స్థానిక కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఎస్పీ బుధవారం హిందూ, ముస్లిం, క్రైస్తవులతో పాటు వివిధ మతాలు కులస్తులతో శాంతి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్ తరువాత హిందూపురం వినాయక నిమజ్జనం రెండో స్థానంలో ఉందన్నారు. ఇక్కడ హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు పెద్ద సంఖ్యలో ఉన్నారన్నారు. పురంలో అత్యంత వైభవంగా జరిగే వినాయక నిమజ్జన వేడుకలు మంచి పండుగ వాతావరణంలో జరగాలని కోరారు. అహింసో పరమో ధర్మహః అనే సిద్ధాంతాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ వారి వా రి ఆచారాలను గౌరవిస్తూనే.... ఇతర మతాల వారి ఆచారాలను గౌరవించాలన్నారు. భిన్నత్వంలో ఏకత్వం పాటిస్తున్న ఇలాంటి దేశంలో ఉన్న మనం శాంతి కాముకులుగా మెలగాలన్నారు. నిర్వహకులు డీజేలకు, బ్యాండు సెట్లకు పెట్టే ఖర్చుతో మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, క్విజ్ లాంటి పోటీలను నిర్వహించాని పేర్కొన్నారు. ఇతరులకు ఇబ్బంది కలిగించేలా మైక్‌సెట్‌లను ఉపయోగించవద్దన్నారు. గుడికి భక్తితో వెళ్లాలే గానీ... మద్యం, గంజాయి లాంటివి తాగి వెళ్లకూడదని సూచించారు. పట్టణంలో జరిగే వినా యక ఉత్సవిలను కలిసికట్టుగా నిర్వ హించాలన్నారు. ఎవరైనా గొడవలు సృష్టించేందు ప్రయత్నిస్తే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చ రించారు. అనంతరం ప్రజా సంఘాల నాయకులు ఎస్పీని సన్మానించారు. కార్యక్రమంలో డీఎస్పీ మహేష్, సీఐలు రాజగోపాల్‌నాయుడు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నం పెట్టే రైతులను కాపాడుకోవాలి

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, సెప్టెంబరు 4 : ప్రపంచానికి అన్నంపెట్టే రైతులను మనం కాపాడుకోవాలని, లేనిపక్షంలో ప్రపంచీకరణకు భవిష్యత్తు లేకుండా పోతుందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. ఆయన బుధవారం సేద్యం చిత్రం పోస్టర్లను పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పడు తున్న బాధలు, సేద్యం కోసం పడే కష్టాలను ప్రతి బింబించే విధంగా సేద్యం సినిమా తీయడం అభినందనీయ విషయం అన్నారు. గుడిలో దేవుడిని పూజి స్తాం... వారు పెట్టే ప్రసాదాన్ని స్వీకరించి రెండు చేతులెత్తి మొక్కుతామని, అసలైన దైవం రైతే అన్నారు. రైతు పండించే పంట ప్రపంచానికే ప్రసాదం లాంటిదన్నారు. రైతును గుర్తించి రైతులపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టడానికి డైరెక్టర్ చంద్రకాంత్ పసుపులేటి సినిమా చిత్రీకరించడం సంతోషించదగ్గ విషయం అన్నారు. ఈనెల 6న సినిమా విడుదలవుతున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా అసోసియేషన్ డైరెక్టర్ హరి, నటులు పసుపులేటి శ్రీనివాసులు, బాబా కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై వక్క రైతులకు శిక్షణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

మడకశిర(అమరాపురం), సెప్టెంబరు 4 : మండలం కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై వక్క రైతులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్త చెన్నరాయుడు, కృషి విజ్ఞాన కేంద్రం హార్టికల్చర్ శాస్త్రవేత్త డాక్టర్ యుగంధర్, వైద్యాధికారి హరిణి పాల్గొన్నారు. వక్కతోట సాగులో అంతరపంటగా ఇతర పంటలను పండించుకోవచ్చని డాక్టర్ యుగంధర్ తెలిపారు. సేంద్రియ ఎరువులను వాడటం వల్ల, చెరువు మట్టిని వక్కచెట్లకు తోలడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గణేష్, ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు జయకుమార్, నాయకులు కృష్ణమూర్తి, నాగోనహళ్లి మంజునాథ్, నరసింహమూర్తి, శివరుద్రప్ప, వ్యవసాయాధికారి మంజునాథ్, వక్కతోట రైతులు పాల్గొన్నారు.

12న చేనేత కార్మికుల ధర్నా

ధర్మవరం, సెప్టెంబరు 4 : బత్తలపల్లి మండలం వేల్పుమడుగు వద్ద ఉన్న జేఆర్ సిల్క్ ఫ్యాక్టరీ వద్ద ఈ నెల 12న ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక కదిరిగేటు సమీపంలోని నేతన్న విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో పాలకులు పవర్‌లూమ్స్ మగ్గాలను విచ్చలవిడిగా ప్రోత్సహించడంతో ధర్మవరంలో చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. చేనేత కార్మికుల ఉపాధిపై దెబ్బకొట్టారన్నారు. చేనేత మంత్రి సవిత, మంత్రి సత్యకుమార్ ధర్మవరంలో ఎదురుక్కొంటున్న చేనేత సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం సహాయ కార్యదర్శి చెన్నంపల్లి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు చట్టా రవి, సీపీఐ పట్టణ కార్యదర్శి రవి, ఏఐటీయూసీ నాయకులు రమణ, జిల్లా కార్యవర్గసభ్యులు ఆదినారాయణ, బాబు, శ్రీధర్, శ్రీనివాసులు, ఓబిలేసు, బాలరంగయ్య, సురేశ్ పాల్గొన్నారు.

నిందితుడి అరెస్టు

నల్లమాడ, సెప్టెంబరు 4 : స్థానిక సర్కిల్ కార్యాలయంలో కంప్యూటర్‌ను చోరీ చేసిన నిందితుడిని బుధవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నరేంద్రరెడ్డి తెలిపారు. గత నెల 20వ తేదీ రాత్రి సర్కిల్ కార్యాలయంలో కంప్యూటర్‌ను చోరీ చేశారన్నారు. ఇన్‌చార్జి ఎస్ఐ వెంకటనారాయణ దర్యాప్తు చేయగా నల్లమాడ వైఎస్ఆర్ సర్కిల్‌లో ముద్దాని సాయికుమార్‌ను అరెస్టు చేశారు. విచారించి చోరీ చేసిన కంప్యూటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి, పుట్టపర్తి కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

వినాయకచవితి వేడుకలపై అవగాహన

హిందూపురం(పరిగి), సెప్టెంబరు 4: మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలపై బుధవారం తహసీల్దార్ హసీనా సుల్తానా ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఐ రంగడు యాదవ్ మాట్లాడుతూ... వినాయక మండపాల ఏర్పాటు కోసం నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి పొందాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాత్రి 8గంటలకే సౌండ్ సిస్టం ఆపేయాలన్నారు. నిమజ్జనం రోజున గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. డీజేలకు అనుమతి ఉండదని పోలీసులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సరస్వతి, డీటీ నరసింహం, సిబ్బంది, పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన గుండుమల



పాఠశాల పైకప్పును పరిశీలిస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిర(అమరాపురం), సెప్టెంబరు 4: అమరాపురం మండలం కరిదాసనహట్టి గ్రామంలోని మండల పరిషత్ పాఠశాల భవనాన్ని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పరిశీలిం చారు. భవనం పైకప్పు పెచ్చులు ఊడి ఉండడం గమనించారు. చిన్నపాటి వర్షానికే పాఠశాల భవనం అంతా కారుతోందని గ్రామస్థులు ఆయనకు తెలిపారు. వెంటనే ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన మరమ్మతులు చేయించాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని ప్రధానోపాధ్యాయురాలు పర్వీన్‌కు సూచించారు. టీడీపీ నాయకులు పరమేశ్వరప్ప, పురుషోత్తం, శివకుమార్, తిమ్మేగౌడ్, రాజశేఖర్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగ్గురి ప్రాణాలను బలిగొన్న వివాహేతర సంబంధం




రామచంద్ర, శోభ మృతదేహాలు



సల్లాపురెమ్మ (ఫైల్)

రామకుప్పం/శాంతిపురం, సెప్టెంబరు 4: ఇద్దరి మధ్య ఏర్పడిన వివాహేతర సంబంధం ముగ్గురి ప్రాణాలను బలిగొంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం శిలామాకులరాయికి చెందిన రామచంద్రకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కొన్నేళ్ల కిందటి నుంచి బెంగళూరులో టిప్పరు నడుపుతూ.. చిన్న చిన్న కాంట్రాక్టు పనులు చేసుకుంటూ జీవించేవాడు. కొన్ని నెలల కిందట హిందూపురానికి చెందిన గిరీష్.. అతడి వద్ద డ్రైవరుగా చేరాడు. అతడికీ భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో గిరీష్ భార్య శోభ, రామచంద్రకు వివాహేతర సంబంధంగా ఏర్పడిది. పది రోజుల కిందట వీరిద్దరూ కనిపించకుండా పోయారు. తన భర్త కనబడటం లేదని గతనెల 24న రామచంద్ర భార్య బెంగళూరులో.. తన భార్య కనబడుట లేదని 26వ తేదీన గిరీష్ హిందూపురంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే రామచంద్ర, శోభ రామకుప్పం మండలం చెలిమిచేను అటవీ ప్రాంతంలోని కాజీవే సమీపంలో అపస్మారక స్థితిలో పడి ఉండగా బుధవారం ఉదయం పశువుల కాపరులు గుర్తించి, గ్రామస్థుల సహకారంతో 108 వాహనంలో కుప్పంలోని పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వీరు మృతిచెందారని వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను పోలీసులు కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రామచంద్ర, శోభ పురుగుల మందు తాగి ఉంటారని, సంఘటన స్థలం వద్ద వారు వాంతులు చేసుకున్న ఆనవాళ్లు ఉన్నాయని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ నరేష్ తెలిపారు.

రెండు రోజుల కిందటే రామచంద్ర తల్లి ఆత్మహత్య

వారం రోజుల కిందట శోభతో కలిసి రామచంద్ర శిలామాకులరాయిలోని తన ఇంటికి వచ్చాడు. దీనిపై తల్లి సల్లాపురమ్మ కుమారుడు రామచంద్రను తీవ్రస్థాయిలో మందలించింది. గుండెజబ్బుతో బాధపడుతున్న ఆమె సోమవారం ఆస్పత్రికెళ్లగా ఆపరేషన్ చేయాలని వైద్యులు తెలిపారు. ఒకవైపు అనారోగ్యం, మరోవైపు కుమారుడి వైఖరి జీర్ణించుకోలేని ఆమె మంగళవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నారు. బుధవారం ఉదయం ఆమె అంత్యక్రియలకు ఏర్పాటు చేస్తుండగా, రామచంద్ర, శోభ ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసింది.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఐసీడీఎస్ అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి

మడకశిర రూరల్, సెప్టెంబరు 4: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. తెలిపారు. పౌష్టికాహార మాసోత్సవాలను బుధవారం మెళవాయి పంచాయతీ కేంద్రంలో ని అంగన్‌వాడీ కేంద్రలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న పీడీ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. పౌష్టికాహారంతో పాటు కూరగాయలను కూడా బాగా తీసుకోవాలన్నారు. అందువల్ల కలిగే లాభాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ లీలావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు,బాలింతలు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ సీడీపీఓ శాంతలక్ష్మి బుధవారం పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో సీడీపీఓ మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రాలద్వారా లభించే పోషకాహారం క్రమం తప్పకుండా వాడాలన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులకు జంక్ ఫుడ్ పెట్టకూడదని కేవలం కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలు వాడాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పుష్ప, యర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : పౌష్టికాహారం తినడంవల్ల రక్తహీనత దరిచేరదని గర్భిణులు, బాలింతలకు సీడీపీఓ శాంతలక్ష్మి సూచించారు. పట్టణంలోని ఎగువగడ్డ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారాన్ని తింటే చిన్నారులకు మంచిదన్నారు. అనంతరం ఇద్దరు చిన్నారులకు అన్న ప్రాసన, ఇద్దరు గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు పుష్ప, శ్యామల, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకశిరటౌన్ : ఆకుకూరలు, పౌష్టికాహారాన్ని తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ అన్నారు. పట్టణంలోని తొమ్మిదో వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు... గుంతలమయం



ఫలారం వద్ద గుంతలు పడ్డ ఆర్అండ్‌బీ రోడ్డు

గుడిబండ, సెప్టెంబరు 4 : మండల కేంద్రమైన గుడిబండ నుంచి మండలపల్లికి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా మారింది. మండలంలోని ఫలారం వద్ద భారీగా గుంతలు పడి అధ్వానంగా మారింది. దీంతో వర్ష కురిసినప్పుడు ఆ గుంతల్లో నీరు నిలిచి ప్రయాణికులకు ఇబ్బందిగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని గుంతల రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయండి

గుడిబండ: మండలంలోని కరేకెర పంచాయతీ దాసరపల్లి, హిరేతుర్పి, హెచ్ గొల్లహట్టి గ్రామాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. వీధి దీపాలు లేకపోవడంతో గ్రామాలు అంధకారంలో ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. కరేకెర గ్రామం కొండకు ఆనుకుని ఉండటంతో ఎలుగుబంట్లు, చిరుతల బెడద అధికంగా ఉందన్నారు. దీంతో భయాం దోళనకు గురవుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు.

వరద బాధితులకు విద్యార్థి సాయం

గోరంట్ల, సెప్టెంబరు 4: విజయవాడ వరదల్లో చిక్కుక్కున్నవారికి తన వంతుసాయంగా పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ధీరజ్ తాను దాచుకున్న మొత్తాన్ని బుధవారం అందజేశారు. గోరంట్లలో దుకాణం నిర్వహిస్తున్న గంధం శ్రీధర్ కుమారుడు ధీరజ్ విజయవాడ వరదబాధితుల సహాయార్థంతాను దాచుకున్న రూ. వెయ్యి మొత్తాన్ని తండ్రితోపాటు గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో సీఐ శేఖర్‌కు అందించారు. ఈ మొత్తాన్ని సీఎం సహాయనిధికి ఫోన్‌పే ద్వారా పంపారు..

తప్పిపోయిన బాలుడి అప్పగింత



పోలీస్ స్టేషన్‌లో బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన సీడీపీఓ, పోలీసులు

పావగడ, సెప్టెంబరు 4 : పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో బుధవారం ఉదయం తప్పిపోయిన జయకృష్ణ (4)అనే బాలుడి ఆచూకీని పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ విషయంపై స్థానిక సీడీపీఓ కార్యాలయంలోని మేనేజర్ రకీబ్ మాట్లాడుతూ... అనంతపురం జిల్లా నార్పల గ్రామానికి చెందిన సంపూర్ణ, లక్ష్మీ దంపతుల కుమారుడు జయకృష్ణ. అతడు బుధవారం ఉదయం పావగడ పట్టణంలోని ఆఫ్‌బండ వద్ద తల్లిదండ్రుల నుంచి దూరంగా వెళ్లాడు. పెనుకొండ మెయినరోడ్డుకు చేరుకుని అక్కడ ఏడుస్తున్నాడు. ప్రమోద్ పెట్రోల్‌బంక్ వారు గమనించి ఆ బాలుడిని ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో జిల్లా కలెక్టర్ శుభ కళ్యాణి సంబంధిత అధికారులకు, పోలీసులకు సమాచారం అందించి అప్రమత్తం చేశారు. దీంతో అధికారులు, పోలీసులు చొరవ తీసుకుని పట్టణ ప్రజల సహకారంతో బాలుడిని పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో తల్లిదండ్రులకు అప్పగించారు. సందర్భంగా ఏసీడీపీఓ విజయలక్ష్మి, అంగనవాడీ సూపర్‌వైజర్ సుశీలమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త శంకుతలమ్మ, శంకర తదితరులు ఉన్నారు.

మాయగాళ్లకు దేహశుద్ధి

పోలీసులకు అప్పగింత



గొలుసు చోరీ నిందితులు



దెబ్బలు తిని స్పృహ కోల్పోయిన దేవేంద్రష

పావగడ, సెప్టెంబరు 4 : మీవద్ద ఉన్న నగలను పాలిష్‌చేసి ధగధగ మెరిసేలా చేస్తామని నమ్మబలికి అపహరణకు పాల్పడిన నిందితులను తిమ్మంపల్లి వాసులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు తిరుమణి పోలీసులు తెలిపారు. బీహార్ రాష్ట్రానికి చెందిన ఆరుగురు పావగడ పట్టణంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివసిస్తున్నారు. వారిలో కన్నయ్య కుమార్, సునీల్‌కుమార్, వీరేంద్రషా అనే ముగ్గురు కలిసి మంగళవారం సాయంత్రం తిమ్మంపల్లికి వెళ్లారు. మీ బంగారు గొలుసు పాలిష్ చేస్తా మంటూ గ్రామంలోని చిన్నక్క అనే వృద్ధురాలిని నమ్మించారు. ఆమె వద్ద నుంచి బంగారు గొలుసు తీసుకుని ద్విచక్రవాహనంలో ఉడాయించారు. ఈ విషయాన్ని ఆమె చుట్టుపక్కల వారికి తెలిపింది. వారు పక్కనే ఉన్న నాగలమడక గ్రామస్థులకు సమాచారం అందించారు. నాగల మడకలో రెండు గ్రామాల వారు కలిసి నిందితులు ముగ్గురినీ పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం వారిని తిరుమణి పోలీస్టేషన్‌లో అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. ఈ సమాచారం తెలుసుకున్నా మిగిలిన ముగ్గురు తాము ఉంటున్న ఇల్లు ఖాళీచేసి పారిపోయినట్లు తెలిపారు.దొరికి ముగ్గురిపై కేసు నమోదుచేసి జైలుకు పంపినట్లు సీఐ గిరీష్ తెలిపారు.

కారు ప్రమాదంలో విశ్రాంత ఉద్యోగి మృతి

● మరొకరికి గాయాలు



వీరన్న (ఫైల్)

పావగడ, సెప్టెంబరు 4 : పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని కెంచగానిపల్లి గేటువద్ద బుధవారం జరిగిన కారు ప్రమాదంలో... ఆంధ్రాలోని కంబదూరు మండలం తిమ్మాపురానికి చెందిన విశ్రాంత ఉద్యోగి వీరన్న(72) అనే వ్యక్తి మృతి చెందగా, అతడి తమ్ముడు చిక్కీరప్ప తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. వీరన్న, చిక్కీరప్ప బుధవారం తిమ్మాపురం నుంచి సొంత పనుల నిమిత్తం కారు(ఏపీ02ఏడీ6254)లో వెళ్తున్నారు. పావగడ సమీపంలో కెంచగానిపల్లి గేటువద్ద కల్వర్టును ఢీకొని కారు చెట్లపొదల్లోకి కారు దూసుకెళ్లింది. చుట్టుపక్కలవారు గమనించి పావగడ పోలీసులకు సమాచారం అందించారు. వారిని 108 వాహనంలో పావగడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందిన అనంతరం వీరన్నను బెంగళూరులోని ఓ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన చిక్కీరప్ప పావగడ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నాడు. ఈ ప్రమాదంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పావగడ పోలీసులు తెలిపారు.